

టీకా మందు పంపిణీకి గండం

జిల్లావ్యాప్తంగా రెండో ఏఎన్ఎంలు సమ్మెకు దిగడంతో ప్రతి బుధవారం నిర్వహించే ఇమ్యూనైజేషన్‌కు ఆటంకం ఏర్పడుతోంది.

- 10లో ▸



సొంతింటి కల నెరవేరేనా..?

జిల్లాలో డబుల్ బెడ్ రూం ఇళ్లు పట్టణాలు, మండలాలకే పరిమితమయ్యాయి. గ్రామాల్లో వాటి ఆనవాళ్లు కూడా లేవు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.9 /23.8

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

తెయూ డిగ్రీ పరీక్షా ఫలితాల విడుదల

- 40.53 శాతం ఉత్తీర్ణత
- బాలికలదే పైచేయి



తెయూ(డిచ్‌పల్లి) : తెయూ డిగ్రీ (ఫైనలియర్) తుది సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తో కలిసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి బుధవారం సాయంత్రం విడుదల చేశారు. డిగ్రీ పరీక్షలకు మొత్తం 9,026 మంది హాజరయ్యారని, 3,658 మంది విద్యార్థులు (40.53 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో బాలికలు 51.80 శాతం, బాలురు 24.16 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ దృష్ట్యా డిగ్రీ పరీక్ష ఫలితాలను త్వరగా విడుదల చేశామన్నారు. అడిషనల్ కంట్రోలర్లు శాంతాబాయి, నందిని, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.www. telanganauniversity.ac.in లో ఫలితాలున్నాయని తెలిపారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

సుభాష్‌నగర్ : ఈడబ్ల్యూఎఫ్ రుణం కావాల్సిన నాన్ గెజిటెడ్, నాల్గో తరగతి ఉద్యోగులు తమ దరఖాస్తులను డ్రాయింగ్ ఆఫీసర్ల ద్వారా జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపించాలని జిల్లా ట్రెజరీ కార్యాలయ ఉప సంచాలకులు కోటేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సంబంధిత ట్రెజరీ, సబ్ ట్రెజరీ ఆఫీస్‌ల నుంచి దరఖాస్తు ఫారాలు పొందవచ్చన్నారు. సెప్టెంబర్ 20వ తేదీ లోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు.

పోచారానికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు




వర్ని : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రస్తుత స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ మండలంలోని జాకోరకు చెందిన కుల సంఘాలు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. పద్మశాలి సంఘంలో 50 కుటుంబాలు, యాదవ సంఘంలో 60 కుటుంబాలు పోచారానికి మద్దతు తెలుపుతూ తీర్మానం ప్రతిని స్పీకర్‌కు అందజేశారు.

నిర్లక్ష్యం చేస్తే విధుల్లో నుంచి తొలగిస్తాం



బాల్కొండ: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే విధుల్లో నుంచి తొలిగిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లను, కంప్యూటర్ అపరేటర్‌ను, టీఏలను డీఆర్‌డీఏ పీడీ చందర్ నాయక్ హెచ్చరించారు. బుధవారం మెండోరా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మస్టర్ల నిర్వహణ సరిగా లేక ఉపాధి కూలీలు తమ కూలీ వేతనాలను నష్టపోయినట్లు తేల్చారు. హరితాహారంలో చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి నాటలేదన్నారు. కంప్యూటర్ అపరేటర్, ఫీల్డ్ అసిస్టెంట్ల తప్పిదాలను ఎత్తి చూపారు. ఎంపీపీ బురుకుల సుక న్య, జిల్లా విజిలెన్స్ అధికారి నారయణ, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీడీవోలు సంతోష్‌కుమార్, శ్రీనివాస్, ఎంపీవో సాయిలు, ఏపీవో పూర్ణచందర్, సర్పంచ్‌లు మిస్బా, ప్రకాశ్, ఉప సర్పంచ్ గంగారెడ్డి తదితరులున్నారు.


సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఖలీల్‌వాడి : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారి డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద మూడు రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన హామీని కేసీఆర్ గాలికి వదిలేశారన్నారు. మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ తదితరులున్నారు.

జయతు సంస్కృతం భారతం

ప్రపంచ భాషలన్నింటికీ మాతృక సంస్కృతం • సంస్కృత భాష దినోత్సవంగా నేటి శ్రావణ పౌర్ణమి



'దివ్యాం భవ్యం సుబోధాంచ శుద్ధ మర్థం ప్రదాయనీం జననీం బహుభాషాణం వందే గీర్వాణ భారతీం'. సంస్కృత భాష ప్రేమికులకు, సుందరమైన ఈ భాషను నేర్చుకునే వారికి శుభాకాంక్షలు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో సంస్కృతం గురించి తెలుసుకునే వారి సంఖ్య పెరిగింది. నేడు శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రపంచ సంస్కృత భాష దినోత్సవం నేపథ్యంలో 'సాక్షి' కథనం.

సంస్కృత భాషా సాహిత్యంలో అన్నీ ఉత్తమ విలువలను తెలియజేసే అంశాలే ఉన్నాయి. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేయాలంటే వారికి చిన్నతనం నుంచే సంస్కృతం నేర్పి నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి. సత్ప్రవర్తనను కలిగించే ధర్మ బోధన కూడా చేయాలి. అప్పుడే ఉత్తమ పౌరులుగా తయారవుతారు. తెలంగాణ సీఎం కేసీఆర్ సంస్కృత భాష గొప్పతనాన్ని చూసి మెదక్ జిల్లా కొల్చారం వద్ద, సంస్కృత పండిత శిరోమణి మల్లినాద సూరి పేరు మీద సంస్కృత విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పుతుండడం సంతోషకరం.



– లక్ష్మీనారాయణ భరద్వాజ్, సంస్కృత అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రపంచంలోనే పురాతనమైన భాషగా ఉన్న సంస్కృతం.. ప్రపంచంలోని అన్ని భాషలకు తల్లిలాంటిది. శబ్దం పుట్టిందే సంస్కృతం నుంచి.. పరమశివుని ఢమరుకం నుంచి శబ్దాలు, 14 సూత్రాలు ఆవిర్భవించినట్లు చెబుతారు. దివ్యమైన, భవ్యమైన, శుద్ధమైన ఈ సంస్కృత భాషలోనే నాలుగు వేదాలు, 18 పురాణాలు, 108 ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, భగవద్గీత, భాగవతం, వ్యాకరణ శాస్త్రం, తర్క, గణిత,ఖగోళ శాస్త్రం లాంటి అన్ని శాస్త్ర సాంకేతిక అంశాలు సాహిత్య రూపంలో పొందుపర్చి ఉన్నాయి. ఆధునిక విజ్ఞానానికి సంస్కృత సాహిత్యమే గొప్ప భాండాగారమని పండితులు చెబుతున్నారు.

సంస్కృతంతో ఆరోగ్యం

- సంస్కృతం మాట్లాడితే శరీరంలోని 72 వేల నాడుల కదలిక ఉంటుందని, దీంతో ఆరోగ్యం బాగుంటుందని అనేకమంది గొప్ప వ్యక్తులు చెప్పారు.
- సంస్కృతంలోని మాత నుంచి ఆంగ్లంలో మదర్, పిత నుంచి ఫాదర్, భ్రాత నుంచి బ్రదర్ అనే పదాలు వచ్చినట్లు పండితులు పేర్కొంటున్నారు.
- 1786లో ఆంగ్ల భాష శాస్త్రవేత్త విలియం జోన్స్ లాటిన్ గ్రీకు భాషలు సంస్కృతం నుంచి ఉద్భవించినట్లు వెల్లడించారు.
- 'సం' అంటే కలిసి, మంచి, బాగా, పరిపూర్ణం అలాగే కత అంటే చేసిన, ఏర్పడిన, పని.. అని చెబుతున్న కర్ణాటకలోని షిమోగా జిల్లా మత్తూర్ గ్రామ ప్రజలు సంస్కృతాన్ని పరిరక్షిస్తున్నారు.
- సంస్కృత శబ్దాల ఆధారంగా ఆదిశంకరాచార్య, పాణిని, కాళిదాసు, పతంజలి సైతం అనేక శాస్త్రాలు, గ్రంథాలు రాశారు.

ఉన్నత విద్యతోనే ఉపాధి అవకాశాలు

- మంత్రి ప్రశాంత్ రెడ్డి
- బాల్కొండలో డిగ్రీ కళాశాల ప్రారంభం

బాల్కొండ : ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుతునే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉన్నత విద్యతోనే ఉపాధి అవకాశాలు ఉంటాయని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యారంగ సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు.

బాల్కొండ నియోజకవర్గంలో రెండోసారి గెలిచాక ఐదు పనులు చేపట్టాలని నిర్ణయించుకున్నానని, అవి పూర్తి చేశానన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవనవ ద్వారా కాళేశ్వరం నీటిని ఎస్సారెస్పీలోకి ఎత్తిపోయడం, ప్యాకేజీ 20, 21ల ద్వారా నియోజకవర్గంలో భీంగల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మండలాలకు సాగు నీరు, భీంగల్ మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం, నియోజక వర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని నిశ్చయించుకుని కేసీఆర్ దయతో పూర్తిచేశానన్నారు. మూడు డిగ్రీ కళాశాలలు ఉన్న ఏకైక నియోజకవర్గం బాల్కొండ అన్నారు. పేదపిల్లలకు ఉచిత విద్యనందిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కళాశాలకు విద్యార్థులను అధిక సంఖ్యలో వచ్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు.



విజయ సంకేతం చూపుతున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి

విద్యతోనే అభివృద్ధి

చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి అన్నారు. బాల్కొండలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. తాను చదువును నమ్ముకున్నాను కాబట్టే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానన్నారు. రాష్ట్రంలో 185 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు.

దళిత వ్యక్తిని అయిన తనను సీఎం కేసీఆర్ గుర్తించి ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌ను చేయడంలో ప్రశాంత్‌రెడ్డి కీలక భూమిక పోషించారన్నారు. ఆర్డీవో వినోద్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌స్వామీ, ఎంపీపీ లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, డీసీసీబీ వైస్ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, సర్పంచ్ బూస సునీత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గన్నారు.

బిల్డర్ వద్ద పనిచేశా : మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ : తాను 1990లలో నెలకు రూ.800లకు ఓ బిల్డర్ వద్ద పనిచేశానని ఆర్అండ్‌బీ శాఖమంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్‌లో తమవారికి 100 ఎకరాల ఆస్తి ఉండేదని, రాజకీయాలు, కుటుంబ బాధ్యతలతో అది మొత్తం పోయిందని పేర్కొన్నారు. దీంతో బిల్డర్ వద్ద పనిచేశానన్నారు. తర్వాత కష్టపడి బిల్డర్‌గా ఎదిగి, మళ్లీ ఆస్తులను సంపాదించుకున్నానన్నారు. ఎమ్మెల్యే అవుతానని కలలో కూడా అనుకోలేదని, ప్రజలు దీవించడంతోనే ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఒకడు కాంక్రీట్ క్రషర్‌కు అడ్డుతగిలాడు, మరొకడు కమీషన్ తీసుకుంటున్నానంటూ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని పరోక్షంగా బీజేపీ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సునీల్‌రెడ్డిల గురించి ప్రస్తావించారు. తనను రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

- సకాలంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కేసుల దర్యాప్తు వేగం పెంచాలని, నిర్ణీత గడువులోపు చార్జ్‌షీట్ దాఖలు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతిపై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితుల తరపున ఆధారాలు సేకరించి చార్జీ షీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. త్వరగా బాధితులకు ఆర్థికసాయం అందేలా కృషి చేయాలన్నారు. పోలీస్ శాఖ తమ నివేదికలను త్వరగా పంపాలని, తద్వారా బాధితులకు ఎక్స్‌గ్రేషియా అందించే ఏర్పాట్లు చేస్తామని పోలీసు అధికారులకు సూచించారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులకు శిక్షపడేలా పూర్తి ఆధారాలు సేకరించి న్యాయస్థానంలో సమర్పించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి శశికళ, ఏసీపీ కిరణ్ కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీటీడబ్ల్యువో నాగూరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రషీద్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ప్రకృతి వైద్యం

- రూ.600 కోట్లతో బాన్సువాడ సెగ్మెంట్ అభివృద్ధి
- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



అక్బర్‌నగర్‌లో బీపీ చెక్ చేయించుకుంటున్న స్పీకర్

రుద్రూర్ : పట్టణాల్లో ఉన్న ప్రకృతి చికిత్స కేంద్రాలు వ్యాపార ధోరణితో పనిచేస్తుండగా అక్బర్‌నగర్ ప్రకృతి చికిత్సాలయం తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందిస్తోందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌లో రూ. 2.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రకృతి ఆశ్రమంలో రూ. 50 లక్షలతో నిర్మించిన 'పోచారం శ్రీనివాస రెడ్డి యాగశాల'ను మంతెన సత్యనారాయణ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో రోగులకు అద్భుతమైన ప్రకృతి వైద్యాన్ని అక్బర్‌నగర్ ప్రకృతి ఆశ్రమం అందిస్తోందన్నారు. ఈ ప్రకృతి ఆశ్రమం ద్వారా 100 కుటుంబాలకు జీవనోపాధి కలుగుతుందని, సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న ఆశ్రమ అభివృద్ధికి విడతల వారీగా రూ. 75 లక్షలు మంజూరు చేశామన్నారు. ఆశ్రమంలో వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. మంతెన సత్యనారాయణ రాజును అభినందించారు. అలాగే బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 600 కోట్ల స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్స్ మంజూరు చేయించుకుని బాన్సువాడ నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్పీకర్‌కు రాఖీలు అక్బర్‌నగర్ డబుల్‌బెడ్‌రూం కాలనీలో మిషన భగీరథ వాటర్ ట్యాంక్ ప్రారంభించడానికి వచ్చిన స్పీకర్‌కు స్థానిక మహిళలు రాఖీలు కట్టి స్వీట్ తినిపించారు. 80 ఇళ్లు కట్టించి సొంతింటి కలను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ గంగామణి ప్రసాద్, ఎంపీపీ సుజాత నాగేందర్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెనోటీసు



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

ఖలీల్‌వాడి : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ 11 నుంచి సమ్మెకు దిగుతామని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీలకు సమ్మె నోటీసులను అందజేశారు. తెలంగాణ అంగనాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి స్వర్ణలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు 40ఏళ్లుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్ ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు ఏవి రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం లేదన్నారు.

ఉపాధ్యాయులకు ఊరట

- బదిలీలు, పదోన్నతులకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్
- హర్షం వ్యక్తం చేస్తున్న టీచర్లు



నిజామాబాద్ అర్బన్ : ఎట్టకేలకు టీచర్ల బదిలీలు, పదోన్నతులు లైన్‌క్లియర్ అయింది. బదిలీలు, పదోన్నతులకు సంబంధించి బుధవారం హైకోర్టు అనుమతించింది. దీంతో ఈ ప్రక్రియకు మోక్షం లభించింది. ఈ ఏడాది జనవరిలో బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో జిల్లావ్యాప్తంగా జనవరి 29 నుంచి ఫిబ్రవరి 25 వరకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించి ముగించాలని పాఠశాల విద్యాశాఖ షెడ్యూలు విడుదల చేసింది. దీని ప్రకారం జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించింది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 1,191 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 4,752 మంది టీచర్లు పనిచేస్తున్నారు. వీరికి చివరిసారిగా 2018లో బదిలీలు చేపట్టారు. సాధారణంగా రెండేళ్ల పూర్తయితే బదిలీలకు అర్హులు, అంతేకాకుండా 8 ఏళ్ల ఒకే చోట పనిచేస్తే బదిలీ తప్పనిసరి. ఎనిమిదేళ్ల ర్వీస్ పూర్తి చేసుకున్నవారు 1,248 మంది టీచర్లు ఉన్నారు.

వీరు కొన్ని నెలలుగా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఉపాధ్యాయ బదిలీలు 2015 లో జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు పదోన్నతులు లేవు. జిల్లాలో 978 మంది ఉపాధ్యాయులు పదోన్నతులకు అర్హత కలిగి ఉన్నారు. ప్రస్తుతం బదిలీలకు లైన్‌క్లియర్ కావడంతో ఎట్టకేలకు బదిలీలు, పదోన్నతులు జరుగనున్నాయి.

ఉపాధ్యాయుల వివరాలు

స్కూల్ అసిస్టెంట్లు	2,015
భాషా పండితులు	489
ఎస్జీటీలు	2,144
పీఈటీలు	104
మొత్తం	4,752

స్వాగతిస్తున్నాం



టీచర్ల బదిలీలు, పదోన్నతులపై హైకోర్టు తీర్పు వల్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియను పూర్తిచేయాలి. ఎంతో మంది టీచర్లు హైకోర్టు తీర్పు వల్ల ఊరట చెందుతున్నారు.

– వెంకటేశ్వర్ గౌడ్, పీఆర్‌టీయూ జనరల్ సెక్రటరీ

కాలయాపన చేయవద్దు



ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల ప్రకారం వెనువెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి. కాలయాపన చేయవద్దు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున ప్రక్రియను వెనువెంటనే పూర్తి చేయాలి.

– వెనిగెళ్ల సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

షెడ్యూల్ విడుదల చేయాలి



ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసి ప్రక్రియను ప్రారంభించాలి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టీచర్లకు ఈ తీర్పు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. ప్రభుత్వ టీచర్లందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పెంట జలంధర్, తెలంగాణ టీచర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

నేడు రక్షాబంధన్

నిజామాబాద్ సిటీ : అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను జిల్లావ్యాప్తంగా నేడు జరుపుకోనున్నారు. రాఖీ పౌర్ణమి అని పిలిచే పండగను శ్రావణ పౌర్ణమి, జంధ్యాల పండగ అని కూడా పిలుస్తారు. సాధారణంగా జంధ్యాన్ని ధరించేవారు ఈరోజు పాతది వదిలి కొత్తదానిని ధరిస్తారు. నగరంలోని రాఖీలు దుకాణాలు కిక్కిరిసిపోయాయి. స్వీట్‌షాప్‌లలో కోలాహలం నెలకొంది. ఆర్టీసీ కూడా మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తే గిఫ్ట్ బాక్స్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

రెండు కేజీబీవీలు మంజూరు

నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ నగరానికి రెండు కేజీబీవీలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ నార్త్, సౌత్ మండలాల్లో రెండు కేజీబీవీలు ఏర్పాటు చేయనున్నారు. దీనికిగాను బుధవారం స్పెషల్ ఆఫీసర్లుగా సుప్రజ, శ్రీవేణిని నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టర్‌కు చిన్నారుల రాఖీ



మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం బాలసదన్ పిల్లలు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తాకు చిన్నారులు, మహిళలు రాఖీలు కట్టారు.

– నిజామాబాద్ నాగారం

క్లుప్తంగా

డిచ్‌పల్లిలో ఆర్‌ఎంపీపై ఫిర్యాదు

డిచ్‌పల్లి: తనను ఆర్‌ఎంపీ డాక్టర్ కట్టా అశోక్ మోసం చేశాడంటూ ఓ మహిళ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ అశోక్ ఐదేళ్లుగా తనతో సహజీవనం చేసి పెళ్లి చేసుకుని ఇప్పుడు వదిలించుకోవాలని చూస్తున్నాడని బాధితురాలు పద్మ ఆరోపించారు. ఆలిండియా హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో అశోక్ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు డాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోర్టు అనుమతి తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్సై మహేశ్ తెలిపారు.

పాడె మోసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



భీమ్‌గల్: భీమ్‌గల్ మాజీ జడ్పీటీసీ ప్రకాశ్‌గౌడ్ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. తెలంగాణ ఉద్యమకారుడిని కోల్పోవడం బాధగా ఉందని మంత్రి అన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేదల సొంతింటి కల నెరవేరేనా..!

- పల్లెల్లో కనిపించని 'డబుల్' ఇళ్లు
- పట్టణాలు, మండలాలకే పరిమితం
- గ్రామాల్లో స్థల కేటాయింపు ఉన్నా ఆచరణకు నోచుకోని వైనం



మోర్తాడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు



పాలెంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూమి

మోర్తాడ్(బాల్కొండ): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్‌బెడ్ ఇళ్ల పథకం గ్రామ పేదలకు కలగానే మారుతోంది. ఇళ్లు కట్టుకోలేని పేదలకు ప్రభుత్వమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తుందని పలుమార్లు సీఎం కేసీఆర్ వెల్లడించారు. కానీ ఆచరణలో మాత్రం పట్టణాలు, మండలాల్లో అమలవుతున్నా పల్లెల్లో మాత్రం అమలు కావడం లేదు. జిల్లాలో 530 జీపీలు ఉండగా కేవలం 29 చోట్లనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. మిగిలిన పంచాయతీల్లో ఒక్క ఇంటికి కూడా పునాది వేయలేదు. పల్లెల్లోనూ ఎంతో మంది ఇళ్లు లేని నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. వీరికి సొంతగా జాగా లేకపోవడమే కాకుండా కొనుగోలు చేయడానికి ఆర్థిక శక్తి లేకపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రతి ఊరిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించడానికి సుమారు 8 ఎకరాల వరకు స్థలాలను సేకరించారు. ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవడానికి చర్యలు తీసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించకుండా ఖాళీగా ఉన్న స్థలాల్లోనే కొన్ని చోట్ల డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. మోర్తాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సేకరించిన స్థలంలో 220 ఇళ్లను నిర్మించారు. వీటి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు కాగా రూ.13.50 కోట్లను ఇళ్ల నిర్మాణానికి, రూ.1.50 కోట్లను మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేశారు. ఈ లెక్కలను పరిశీలిస్తే ఒక్కో డబుల్ బెడ్‌రూం ఇంటికి రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది.

'గృహలక్ష్మి'తోనే సరిపెడతారా...?

మండల కేంద్రాలను మినహాయించి ఇతర పంచాయతీల పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించడానికి చర్యలు తీసుకోకపోవడాన్ని పరిశీలిస్తే గృహలక్ష్మి పథకంతోనే సరిపెడతారా అనే సందేహం వ్యక్తమవుతోంది. గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయాన్ని అందించనున్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు ఒక్కో ఇంటికి రూ.6లక్షల వరకు ఖర్చు చేసిన ప్రభుత్వం సొంతంగా ఇంటిని నిర్మించుకునేవారికి రూ.3లక్షలే సాయం అందించనుంది.

అంటే ఇంటిని నిర్మించుకునేవారిపై ఆర్థిక భారం ఎక్కువయ్యే అవకాశం ఉందని వెల్లడవుతోంది. గృహలక్ష్మి పథకం కింద అందించే సాయం విలువను పెంచితే డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించి ఇవ్వకపోయినా ఇబ్బంది ఉండదనే వాదన బలంగా వినిపిస్తోంది.

పల్లెల్లోనూ నిర్మించాలి..



మండల కేంద్రాలు, పట్టణాల్లోని ప్రజలను ఒకలా పల్లెల్లోని వారిని మరోలా చూడడం ఎంతవరకు సమంజసం. డబుల్ బెడ్‌రూం ఇళ్లను పల్లెల్లోను నిర్మించాలి. అర్హులైన వారిని గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తే బాగుంటుంది. పల్లె ప్రజలు అంటే తెలంగాణ ప్రభుత్వానికి చులకనగా ఉంది.

– అడెపు సవిత, ఎంపీటీసీ సభ్యురాలు, తాళ్లరాంపూర్

పల్లె ప్రజలూ మనుషులే..



పల్లెల్లోని ప్రజలను కూడా మనుషులుగా గుర్తించాలి. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి పల్లెలను ఎందుకు మరిచి పోయారు. పల్లెల్లో ఉన్నవారు ఓట్లు వేయరా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పల్లెల్లోనూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి.

– సోమ పెద్ద రాజారెడ్డి, సర్పంచ్, గుమ్మిర్యాల్







క్రైం కార్నర్

చెరువుల్లో పడి ఇద్దరి మృతి



దత్తురాంరెడ్డి (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని కారేగాం కిందికుంట చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఏఎస్సై లింబాద్రి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దత్తురాంరెడ్డి (43) మంగళవారం చెరువులో నుంచి గేదేలను బయటకు పంపే క్రమంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎల్లయ్య చెరువులో..

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్ గ్రామంలోని ఎల్లయ్య చెరువులో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఏఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనిత (34) మంగళవారం రాత్రి తన భర్త బాగయ్యతో గొడవపడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఒకరు..

ఖలీల్‌వాడి: జాన్కంపేట్, నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని కోజాకాలనీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై తావుజీ తెలిపారు. మృతుడి వయస్సు 30 ఏండ్ల వరకు ఉంటుందని అన్నారు. వివరాలు తెలిసిన వారు 8712568440 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుతో రైతు..

ఎల్లారెడ్డి: పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మాశిడి కిషన్ (50) పొలంలో పనులు చేస్తుండగా పాము కాటువేసిందన్నారు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల శివారులో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. తాడ్వాయికి చెందిన పుల్లూరి నర్సయ్య రోజు మాదిరిగానే తన పాడి గేదెను గ్రామ శివారులోని చెరువు కట్టపై మేతకు తీసుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఆర్థికసాయం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

మోటారు పంపు చోరీ

ఇందల్వాయి: మండలంలోని పల్లె ప్రకృతి వనంలో ఉన్న బోరుబావి నుంచి మోటారు పంపును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీ చేసినట్లు ఎంపీటీసీ చింతల దాసు బుధవారం తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం

రుద్రూర్: మండల కేంద్రంలోని రెండు ఆలయాల్లో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి యత్నించారు. చౌడేశ్వరీ దేవి ఆలయం తాళాన్ని పగులగొట్టిన దుండగులు గర్భగుడి హుండీలో ఉన్న నగదును దొంగిలించారు. అంతేకాకుండా పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో హుండీని పగులగొట్టేందుకు ప్రయత్నం చేశారు. కానీ హుండీ తెరుచుకోలేదు. ఉదయం పూజలు చేయడానికి వచ్చిన విషయాన్ని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు.

హత్యకేసులో అత్తామామ అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో ఈ నెల 28న కృష్ణను హత్య చేసిన ఘటనలో అత్తామామలతో పాటు అతని భార్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సౌత్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రశేఖర్ కాలనీకి చెందిన గాదం గంగ, దానమైన కృష్ణ ఆరేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజుల నుంచి గంగను వేధిస్తుండడతో సహనం కోల్పోయిన భార్య, అత్తామామలు సత్తెమ్మ, గంగామురళీ గొడ్డలితో కలిసి హత్య చేశారు.

ఆకలిబాధ తట్టుకోలేక ఆత్మహత్య!

రెంజల్(బోధన్): కొడుకులు కాదు పొమ్మనడంతో ఆకలిబాధ తట్టుకోలేక 57 ఏండ్ల వృద్ధుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఓ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాలుగేండ్ల క్రితం భార్య మృతిచెందడంతో గ్రామంలోని ఇద్దరు కుమారుల వద్ద జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా కొడుకులు, కోడళ్లు పట్టించుకోకపోవడంతో ఆకలితో అలమటించేవాడు. చివరకు ఆకలిబాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పురుగుల మందు తాగి నునావత్ అశోక్(26) మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న గుంతలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు బిచ్కుంద మండలం సీతారాంపల్లి తండాకు చెందిన నూనావత్ అశోక్‌గా గుర్తించారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన అశోక్ తిరిగి రాలేదన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

యువకుడి అదృశ్యం



రాజశేఖర్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ఒడ్డెరకాలనీకి చెందిన యువకుడు బోదాసు రాజశేఖర్ అదృశ్యమైనట్లు ఎస్సై రాము బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని మహేశ్ దగ్గర రాజశేఖర్ గేదెల కాపరిగా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



మాక్లూర్: మొరం టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటన మండలంలోని గాంధీనగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఆయుస్సు, అతని తల్లి షాహిన్‌బేగం బైక్‌పై నిజామాబాద్ వైపు వెళ్తుండగా దాస్‌నగర్ నుంచి ఖాళీగా వస్తున్న మొరం టిప్పర్ బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఆయుస్సు తలకు బలమైన గాయాలు కాగా తల్లి షాహీన్‌బేగానికి చేయి విరిగింది. స్థానికులు అంబులెన్సులో చికిత్స నిమితం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన విషయమై ఎస్సై సుధీర్‌రావును వివరణ కోరగా తమకు ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఎమ్మెల్యేను నిలదీసేందుకు యువత సన్నద్ధం

- 4 గంటలు ఆలస్యంగా ఎమ్మెల్యే ప్రజాఆశీర్వాద యాత్ర



భూమిపూజ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



వాట్సాప్ ద్వారా వైరల్ చేసిన ఫ్లెక్సీ

మాక్లూర్: మండలంలోని గుంజిలి గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రజా ఆశీర్వాద యాత్ర 11 గంటలకు ప్రారంభమైంది. గ్రామంలో ఎమ్మెల్యే ప్రజాఆశీర్వాద యాత్రను తెలుసుకున్న స్థానిక యువకులు 2018లో ఇచ్చిన హామీలపై ఎమ్మెల్యేను నిలదీద్దామని 11 ప్రశ్నలు సంధిస్తూ వాట్సాప్, పేస్‌బుక్‌లలో వైరల్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక పరిస్థితులను తెలుసుకుని అన్ని సద్దుమనిగిన తరువాత 4 గంటలు ఆలస్యంతో గ్రామానికి 11 గంటలకు చేరుకున్నారు. గ్రామస్తులు కొత్తపల్లి ఆర్‌అండ్‌రోడ్ నుంచి బైక్ ర్యాలీతో ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ముందుగా రామాలయం, ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. మహిళలతో రాఖీ కట్టించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బడుగు సత్యం, సొసైటీ చైర్‌పర్సన్ గోపు లక్ష్మి, ఆకుల రజినీశ్, సర్పంచ్ గుండారం శేఖర్, గోపు రంజిత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నివర్గాలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్



దీక్షకు మద్దతు తెలిపిన ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని అన్నివర్గాలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని, సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షకు ధన్‌పాల్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దిలీప్, ప్రధానకార్యదర్శి రాజు, కోశాధికారి ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు అష్రఫ్ అలీ, నాయకులు సుక్క మధు, ఇల్లెందుల ప్రభాకర్, మాస్టర్ శంకర్, బంటు రాము, పవన్, ఆనంద్, గంగాధర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు నగదు బహుమతి అందజేత



వేల్పూర్: కామారెడ్డి ఆర్టీఏ పరిధిలో హోంగార్డుగా పనిచేస్తున్న వేల్పూర్ వాసి గుగ్గిలం అశోక్ జాతీయ స్థాయి మారథాన్‌కు ఎంపికయ్యాడు. జాతీయ స్పోర్ట్స్ డేను పురస్కరించుకొని మంగళవారం రాత్రి కలెక్టర్ జితేశ్ పాటిల్ అశోక్‌కు రూ.20 వేల నగదు బహుమతి అందించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మెదక్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 400, 800 మీటర్ల మారథాన్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. కార్యక్రమంలో కామారెడ్డి ఆర్టీఏ వాణి పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ లేక అవస్థలు

ఇందల్వాయి: మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు విక్రయాలు జరిపేందుకు మండల కేంద్రానికి రాగా సరైన సౌకర్యాలు అవస్థలు పడుతున్నారు. ఒక్కో చేత్తో గొడుగు పట్టుకుంటూ మరో చేత్తో కూరగాయలను విక్రయిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



ఆర్టీసీ కార్గోలో దోపిడీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ కార్గోలో దోపిడీకి గురి చేస్తున్నారని పలువురు ఆరోపించారు. బుధవారం పార్సిల్ తీసుకున్న ఇద్దరు వ్యక్తులు ఆందోళన చేశారు. తమకు వచ్చిన పార్సిల్ డిపోలో తీసుకుంటే అదనంగా రూ. 10 నుంచి రూ. 20 వరకు బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిపోలో ఫ్రీగా డెలివరీ చేయాల్సి ఉండగా బలవంతంగా డబ్బులు వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిసిప్ట్ ఇవ్వాలని ప్రశ్నిస్తే ఆర్టీసి సిబ్బంది దూషించారని వాపోయారు. అధికారులు స్పందించాలని కోరారు.


నేరాల నియంత్రణకు కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాములబస్తీలో ఏసీపీ ఆధ్వర్యంలో నగర సీఐ నరహరి, ఎస్సైలు ప్రవీణ్, సంజీవ్, అశోక్, యాదగిరి, అప్పారావు, సిబ్బందితో కలిసి బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య



సబిత్‌రెడ్డి (ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆర్థిక సమస్యలు, భార్యతో విడాకులతో జీవితంపై విరక్తి చెందిన ఓ పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా ఉగ్రవాయి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన పుట్ట సబిత్‌రెడ్డి(29) ఉగ్రవాయి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలంగా సతమతమవుతున్నాడు. కుటుంబ కలహాలతో అతడి భార్య విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో మానసికంగా కుంగిపోయిన సబిత్‌రెడ్డి బుధవారం తాను పనిచేసే పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనానికి వెళ్లి, చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు మృతదేహాన్ని గమనించి దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. ఆర్థిక సమస్యలతో సబిత్‌రెడ్డి కొద్ది రోజులుగా మానసిక ఒత్తిడికి గురవుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకోవడంతో ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సూసైడ్ నోట్ రాసి...

తాను అందరికీ ఆదర్శంగా ఉండాలని అనుకునే వాడినని, చేసిన ఒక తప్పు కారణంగా అలా ఉండలేకపోయానని మృతుడు సబిత్‌రెడ్డి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. సమస్యల కారణంగా వృత్తికి సైతం న్యాయం చేయలేకపోతున్నానని అందులో రాశాడు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, తాను చనిపోతున్నానని నోట్‌లో పేర్కొన్నాడు.

గ్రామంలో విషాదఛాయలు

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో జీపీ కార్యదర్శి పుట్ట సబిత్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, సర్పంచ్ నరేశ్, ఉపసర్పంచ్ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ మురళీ పాల్గొన్నారు.

ఒకరిపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్‌రోడ్డు చౌరస్తా ప్రాంతంలో మహారాష్ట్రకు చెందిన సంతోష్‌పై షేక్ సలీం బ్లేడ్‌తో దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. దీంతో తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నగరంలోని ముస్తాహిద్‌పుర ప్రాంతానికి చెందిన షేక్ సలీం, సంతోష్‌కు మధ్య వైన్స్ ప్రాంతంలో గొడవ జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పేకాటస్థావరంపై..

ఖలీల్‌వాడి: మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని ఆదర్శనగర్‌లో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.16,820 నగ దు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా పేకాట ఆడితే తమకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు.

బ్రహ్మపురి కాలనీలో..

ఖలీల్‌వాడి: నగరంలోని బ్రహ్మపురి కాలనీలో ఏసీపీ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు పేకాట స్థావరంపై దాడి నిర్వహించినట్లు ఎస్సై అశోక్ బుధవారం తెలిపారు. దాడిలో ఐదుగురుని అరెస్టు చేసి వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.